# ప్రధాని మోడీని ఆశీర్వదించండి

• గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** సరికొత్త సంకల్పంతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీని ఆశీర్వదించాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీలోని తన నివాసం 6, అశోక్ రోడ్‌లో 74వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించిన కిషన్ రెడ్డి, అనంతరం మాట్లాడుతూ దేశ ప్రజలకు గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా గత ఏడాది నుంచి జరుపుకుంటున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' వేడుకల్లో భాగంగా గుర్తింపు నకు నోచుకోని స్వాతంత్ర్య సమర యోధులు, దేశం కోసం పాటు పడిన మహనీయులను స్మరించుకుంటూ ముందుకెళ్తున్నామని గుర్తుచేశారు. ఇది వచ్చే ఆగస్టు వరకు కొనసాగుతుందని తెలిపారు. అలాగే ఈ ఏడాది జీ20 సదస్సుకు సారథ్యం వహించే అవకాశం భారతదేశానికి, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి వచ్చిందని, ఈ సందర్భంగా దేశంలోని 56 నగరాల్లో 250కి పైగా సమావేశాలు జరుగుతాయని తెలిపారు. ఇందులో 20 దేశాలకు చెందిన దేశాధినేతలు, మంత్రులు, ఉన్నతాధికారులు, వివిధ రంగాల నిపుణులు.. ఇలా లక్ష మంది వరకు పాల్గొంటారని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సమస్యలను భారతదేశం అధిగమిస్తూ ముందుకు సాగుతోందని, కోవిడ్19ను జయించి ముందుకెళ్తున్నామని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచంలోనే 5వ ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగిందని, ఈ క్రమంలో దేశంలో ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదు అన్న ఉద్దేశంతో ప్రధానమంత్రి పేదలందరికీ ఉచితంగా ఆహార ధాన్యాలు అందజేస్తున్నారని గుర్తుచేశారు.

మరోవైపు నిరుద్యోగ సమస్యను అధిగమించేందుకు స్టార్టప్ ఇండియా, ముద్ర యోజన, సూక్ష్మ,చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, రాయితీలు అందజేస్తున్నామని తెలిపారు. దేశంలో అత్యధిక మంది ఆధారపడ్డ వ్యవసాయ రంగంలో రైతులకు రూ. 6 వేలు అందజేస్తోందని తెలిపారు. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల సంఖ్యను పెంచుకుంటూ శరవేగంగా రవాణా జరిగేలా మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్య మిస్తున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ రంగంలో 10 లక్షల ఉద్యోగాల భర్తీ కూడా జరుగుతోందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రాజ్యాంగాన్ని మరింత గౌరవాన్ని తీసుకొస్తూ ముందు కెళ్దామని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీని ఆశీర్వదించాలని కిషన్ రెడ్డి దేశ ప్రజలను కోరారు.

## ఈ ఏడాది షార్ నుంచి 11 రాకెట్ ప్రయోగాలు లక్ష్యం

షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్

**సూళ్లూరుపేట, ప్రభన్యూస్:** భారత అంతరిక్ష పరిశోధన సంస్థ షార్ నుంచి ఈ ఏడాది చివరిలోపు 11 రాకెట్ ప్రయోగాలను చేపట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు షార్ సెంటర్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ తెలియజేశారు. గురువారం షార్‌లో జరిగిన రిపబ్లిక్ డే వేడుకలు అనంతరం విలేకర్ల సమా వేశంలో షార్ డైరెక్టర్ మాట్లాడుతూ 2023లో పీఎస్ఎల్‌వీ రాకెట్ 5, ఎల్‌వీఎం 2, ఎస్ఎస్ఎల్‌వీ 2, జీఎస్ఎల్‌వీ -ఎఫ్12 రాకెట్‌తో పాటు మరో జీఎస్ఎల్‌వీ రాకెట్ ప్రయోగం కూడా ఉంటుందని తెలిపారు. ఈ ఏడాది చివరలో గగన్‌యాన్ -డీ1 ప్రయోగం ఉంటుందని దీనికి సంబంధించిన వివిధ భూ పరీక్షలను ఇప్పటికే ఇస్రో పూర్తి చేసిందని ఈ ఏడాదిలో ప్రధానంగా ఆదిత్య-ఎల్1 ఉపగ్రహ ప్రయోగము, చంద్రయాన్ -3, వన్‌వెబ్, ఎల్‌వీఎం -3 మానవరహిత గగన్ యాన్ -డీ1 ఉపగ్రహ ప్రయోగాలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికే షార్‌లో రాకెట్ తయారీకి రాకెట్ ప్రయోగానికి కావాలసిన అన్ని రకాల అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో సమకూర్చిన మౌళిక వసతులు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఆయన తెలియజేశారు.

# 'భారత్ పర్వ్' ఉత్సవం మినీ ఇండియాకు ప్రతిబింబం

ఎర్రకోట వద్ద ఢంకా బజాయించి ప్రారంభించిన కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** ఢిల్లీలోని కర్తవ్యపథ్‌లో గురువారం జరిగిన 74వ భారత గణతంత్ర ఉత్సవాల పరేడ్.. భారతదేశ శౌర్య, సాహసాలకు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించిందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి భారతీయుడు గర్వించేలా జరిగిన ఈ ఉత్సవాల్లో.. ప్రధానిమోదీ సంకల్పించిన ఆత్మనిర్భర భారత్, నారీశక్తి సామర్థ్యం చాలా చక్కగా ప్రదర్శితమైందని ఆయన అన్నారు. గురువారం సాయంత్రం ఎర్రకోట వద్ద 'భారత్ పర్వ్' కార్యక్రమాన్ని ఢంకా బజాయించి ప్రారంభించిన కిషన్ రెడ్డి, ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఈ భారత్ పర్వ్ కార్యక్రమం 'మినీ ఇండియా'ను తలపిస్తోందన్నారు. వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను, కళలను, వివిధ రకాల వంటకాలను చూస్తుంటే.. యావద్భారతాన్ని ఒకేచోట చూసినట్లు అనిపిస్తోందన్నారు. గత రెండేళ్లుగా కరోనా కారణంగా భారత్ పర్వ్ కార్యక్రమం జరుపుకోలేకపోయామన్న కిషన్ రెడ్డి.. ఈసారి ఈ ఉత్సవాలను జరుపుకుంటుండటం, ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా భాగస్వాములు అవుతుండటం శుభపరిణా మమన్నారు. భారత పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని ఆయన అన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్ లో ప్రదర్శించిన శకటాలన్నీ ఈ భారత్‌పర్వ్‌లో ప్రదర్శనకు పెట్టామని కిషన్ రెడ్డి తెలిపారు. ఇలాంటి ప్రదర్శనను తిలకించేందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సంకల్పించిన అమృత్ కాల్ లక్ష్యాలను గుర్తుచేసిన కేంద్ర మంత్రి.. వచ్చే 25 ఏళ్లలో భారత పర్యాటకాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా భారతదేశంలోని మారుమూల ప్రాంతాల్లోని పర్యాటక కేంద్రాలను కూడా అనుసంధానించేందుకు రైలు, రోడ్డు, విమాన, టెలికాంతోపాటుగా సాంస్కృతిక అనుసంధానతకు వేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు.

## రాజ్యాంగం గౌరవం పెంచాలి: కిషన్ రెడ్డి

న్యూఢిల్లీ: అంబేద్కర్ రచించిన రాజ్యాంగానికి గౌరవం పెంచేలా అందరం కలిసికట్టుగా పనిచేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని తన నివాసంలో జాతీయ జెండాను ఎగురవేశారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి మందా జగన్నాథం, తెలంగాణ భవన్ ఓఎస్డీ సంజయ్ జాజు పాల్గొన్నారు.

# భారత్ పర్వ్ మినీ ఇండియాకు ప్రతిబింబం

## కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

**ఈనాడు, దిల్లీ :** వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, వివిధ రకాల వంటకాలను చూస్తుంటే యావద్భారతాన్ని ఒకే చోట చూసినట్లనిపిస్తోందని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎర్రకోట వద్ద భారత్ పర్వ్ కార్యక్రమాన్ని ఢంకా మోగించి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ భారత్ పర్వ్ కార్యక్రమం 'మినీ ఇండియా'ను తలపిస్తోందన్నారు. రెండేళ్లుగా కరోనా కారణంగా ఈ కార్యక్రమాన్ని జరుపుకోలేకపోయామన్నారు. భారత పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహాన్నివ్వడమే భారత్‌పర్వ్ ఉద్దేశమన్నారు. గణతంత్ర కవాతులో ప్రదర్శించిన శకటాలను భారత్‌పర్వ్‌లో ప్రదర్శనకు ఉంచామని తెలిపారు. నంతరం మంత్రి వివిధ రాష్ట్రాల ఫుడ్ కోర్టులను సందర్శించారు. మంత్రి ఆంధ్రప్రదేశ్ స్టాల్ వద్ద ఆగి మిర్చిబజ్జీ తిన్నారు. ఫోన్ పే ద్వారా చెల్లింపులు చేశారు. తెలంగాణ స్టాల్ వద్ద ఏర్పాట్లు పూర్తి కాకపోవడంతో నిర్వాహకులతో కాసేపు మాట్లాడి ముందుకు సాగారు.



ఆంధ్రప్రదేశ్ స్టాల్ వద్ద మిర్చి బజ్జీ తింటున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



# మినీ ఇండియాలా భారత్ పర్వ్

## ఆత్మనిర్భర్, నారీశక్తిని రిపబ్లిక్ డే వేడుకలు ప్రతిబింబించాయి: కిషన్‌రెడ్డి

**న్యూఢిల్లీ, వెలుగు:** రిపబ్లిక్‌డే సందర్భంగా కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఎర్రకోట వద్ద ఏర్పాటు చేసిన 'భారత్ పర్వ్'.. 'మినీ ఇండియా'ను తలపిస్తోందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఢిల్లీ కర్తవ్యపథ్ లో నిర్వహించిన రిపబ్లిక్‌డే పరేడ్.. మనదేశ సంస్కృతి, సంప్రదాయాలను, మన సైన్యం ధైర్య సాహసాలను ప్రతిబింబించిందని, ప్రధాని మోడీ సంకల్పించిన ఆత్మనిర్భర్ భారత్, నారీశక్తి సామర్థ్యం చాలా చక్కగా ప్రదర్శితమైందని కొనియాడారు. ఈ వేడుకలు ప్రతి భారతీయుడికీ గర్వకారణమన్నారు. గురువారం ఎర్రకోట వద్ద 'భారత్ పర్వ్' కార్యక్రమాన్ని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలను, కళలను, వివిధ రకాల వంటకాలను చూస్తుంటే యావద్భారతాన్ని ఒకేచోట చూసినట్లు అనిపిస్తోందన్నారు. కరోనా కారణంగా రెండేండ్లుగా భారత్ పర్వ్ కార్యక్రమాన్ని జరుపుకోలేకపోయామని, ఈసారి ఉత్సవాల్లో అందరూ ఉత్సాహంగా పాల్గొంటున్నారని చెప్పారు. రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొన్న 23 శకటాలను భారత్ పర్వ్ లో ప్రదర్శనకు పెట్టారు.

**ప్రపంచంలో 5వ ఆర్థిక శక్తిగా ఇండియా**

రిపబ్లిక్‌డే సందర్భంగా అశోక్ రోడ్ 6లోని తన అధికారిక నివాసంలో కిషన్ రెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ప్రపంచంలోనే 5వ ఆర్థికశక్తిగా ఇండియా ఎదిగిందని, కరోనాను జయించి మనదేశం విజయవంతంగా ముందుకెళుతోందని అన్నారు. రాజ్యాంగానికి గౌరవం పెంచేందుకు దేశ ప్రజలంతా కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ నేతృత్వంలో దేశాన్ని అభివృద్ధి, సంక్షేమ బాటలో నడిపించేందుకు కేంద్రం అహర్నిశలు శ్రమిస్తోందని కిషన్‌రెడ్డి అన్నారు.